

విద్యార్థులపై తేనెటీగల దాడి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి



చికిత్స పొందుతున్న విద్యార్థులు

బర్రింకలపాడులోని గిరిజన గురుకుల జూనియర్ కళాశాల విద్యార్థులపై శనివారం మధ్యాహ్నం తేనెటీగలు దాడి చేశాయి. హాస్టల్‌లో భోజనం అనంతరం ప్రాక్టికల్ పరీక్షలు ఉండటంతో మెటీరియల్ కోసం 20 మంది విద్యార్థులు టెర్రస్ పైకి వెళ్లగా పక్కనే ఉన్న తేనెటీగల గుంపు దాడి చేసింది. వెంటనే అప్రమత్తమైన తోటి విద్యార్థులు కిటికీ డోర్ వేయడంతో పెను ప్రమాదం తప్పింది. తేనెటీగల దాడిలో గాయపడిన ఎనిమిది మంది విద్యార్థులను చికిత్స నిమిత్తం జీలుగుమిల్లి పిహెచ్‌సికి తరలించారు. కళాశాల పక్కనే మామిడి చెట్టు ఉండటంతో ప్రతి సంవత్సరం అదే ప్రదేశంలో తేనెపట్టు పెడుతున్నట్లు అధ్యాపకులు చెబుతున్నారు. కళాశాల సమీపంలో తేనె పట్టు లేకుండా చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఎంఎల్‌సి ఎన్నికల ప్రచారం జోరు

అధికారం అండగా ముందుకు సాగుతున్న కూటమి అభ్యర్థి

సమస్యల పరిష్కారానికి స్పష్టమైన డిమాండ్లతో పిడిఎఫ్ ప్రచారం

ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజాసంఘాల నుంచి పెరుగుతున్న మద్దతు

పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులు తరపున ఎంఎల్‌సిలు ఐవి, గోపీమూర్తి విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి


శాసన మండలి ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి స్థానానికి ప్రచారం జోరందుకుంది. ఈ ఎన్నికల్లో 35 మంది అభ్యర్థులు బరిలో ఉన్న సంగతి తెలిసిందే. అయితే ఇద్దరు అభ్యర్థుల మధ్య ప్రధాన పోటీ ఉందని పరిశీలకుల అంచనా. అధికార టిడిపికి చెందిన పేరాబత్తుల రాజశేఖరం, పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులు (డివి.రాఘవులు) మధ్య పోటీ హోరాహోరీగా సాగుతోంది. పిడిఎఫ్‌కు మంచి పట్టు ఉన్న ఈ స్థానంలో ఎలాగైనా ఈ సారి గెలుపొందాలని ఓటర్ల నమోదు దగ్గర నుంచి టిడిపి ప్రత్యేక దృష్టి సారించింది. అలాగే మంత్రులు, ఎంఎల్‌ఎలకు ప్రధాన బాధ్యతలు అప్పగించింది. మండలస్థాయి నేతలను సైతం రంగంలోకి దింపి ప్రచారం సాగిస్తోంది. అయితే అధికార దర్పం మినహా ప్రచారంలో గ్రాడ్యుయేట్లకు చేసిందేమిటీ, చేసేదేమిటీ అనే అంశాలేవీ లేకపోవడం చర్చనీయాంశమవుతోంది. ఇప్పటికే కూటమి అధికారంలోకి రాగానే డిఎస్‌సి ఫైల్‌పైనే తొలి సంతకం అని పెట్టినా ఇప్పటికీ నోటిఫికేషన్ కూడా వెలువడలేదు. వివిధ కారణాలు చెప్పి వాయిదా వేసుకుంటూ వచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి ఎనిమిది నెలలు దాటుతున్నా డిఎస్‌సిపై స్పష్టత రాకపోవడం ఆ అభ్యర్థుల్లో నిరాశ నెలకొందనడంలో ఎటువంటి సందేహమూ లేదు. ఇక మిగిలిన ఖాళీల భర్తీ సంగతి తెలియంది కాదు. అదే సమయంలో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంబంధించి ఎటువంటి తీపి కబురూ లేదు. సరికదా వేతనాలు ఆలస్యమవుతున్నాయనే ఆవేదన వారిలో బలంగా ఉంది. తాజాగా కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఖాళీల భర్తీ ప్రయివేటు ఏజెన్సీలకు అప్పగించాలనే నిర్ణయంపై తీవ్ర వ్యతిరేకత కన్పిస్తోంది. ఇక నిరుద్యోగ భృతి ఊసేలేదు. అదే సమయంలో ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి క్రిస్మస్, సంక్రాంతి సందర్భంగా డిఎల విడుదలపై హడావుడీ చేసినా కనీస ప్రస్తావన లేకపోవడం వారిని నిరాశకు గురి చేసింది. ఈ క్రమంలో అధికారం చేపట్టి ఎనిమిది నెలలైనా చిన్నపాటి అంశాల పరిష్కారం చేపట్టని కూటమి ప్రభుత్వంపై ఆయా తరగతుల ఉద్యోగులు, ప్రజలు అసంతృప్తితో ఉన్నారనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. అయితే కూటమి అభ్యర్థి ప్రధానంగా అధికారమే అండగా గెలిచే ప్రయత్నాల్లో ఉన్నారనేది బహిరంగ రహస్యం.

ఇక పిడిఎఫ్ ఈ స్థానంలో తొలి ఎన్నికల్లోనే విజయబావుటా ఎగరేసింది. నాడు కచ్చా జార్జి విక్టర్ ఎంఎల్‌సిగా అందించిన సేవలు గ్రాడ్యుయేట్లకు చిరస్మరణీయమే. తర్వాత ఎన్నికల్లో కార్పొరేట్ అభ్యర్థుల హవా సాగినా గత ఎన్నికల్లో ఉద్యమాల నేత ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవి) విజయకేతనం ఎగురవేశారు. నాటి నుంచి నేటి వరకూ శాసనమండలిలో ఆయా తరగతుల ప్రజల సమస్యలపై ప్రశ్నించడమే కాకుండా ప్రజా ఉద్యమాలకు మద్దతుగా ప్రత్యక్ష ఉద్యమాల్లో సైతం పాల్గొని నిర్బంధానికి సైతం గురయ్యారు. టీచర్స్ ఎంఎల్‌సి ఎన్నికల్లో షేక్ సాబ్జీ, తర్వాత ఉప ఎన్నికల్లో బొర్రా గోపీమూర్తి పిడిఎఫ్ తరపున గెలుపొందిన సంగతి తెలిసిందే. ప్రధానంగా పిడిఎఫ్ అంటే ఉద్యోగ, కార్మిక, ప్రజల గొంతుకగా పేరొందడమే కాకుండా ఆయా తరగతుల ప్రజల పోరాటాల్లో ప్రత్యక్షంగా పాల్గొనడం, నిరాడంబరత అందరినీ ఆకర్షిస్తోంది. ఆయా ప్రజా ఉద్యమాలకు నేతృత్వం వహించే సంఘాలన్నీ గతంలో వలే పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులు తరపున గ్రాడ్యుయేట్ ఓటర్లను నేరుగా కలుస్తూ ప్రచారం సాగిస్తున్నాయి. అదే సమయంలో సమస్యల పరిష్కారానికి తమ డిమాండ్లేమిటి అనేది కూడా ఆయా గ్రాడ్యుయేట్ల ముందుంచడం వారిని ఆలోచింపజేస్తోంది. అధికార దర్పంగా కాకుండా సామాన్యుడి ప్రచారం విధానాలు, అంశాల ప్రాతిపదికన సాగుతుండటం విద్యావంతుల్లో చర్చనీయాంశం అవుతుందనడంలో ఎటువంటి సందేహమూ లేదు. అయితే విధానాలు, డిమాండ్లతో కూడిన ప్రచారంతో ముందుకు సాగుతున్న పిడిఎఫ్ అభ్యర్థి అయిన సామాన్యుడికి పట్టం కడతారో, కూటమి అభ్యర్థి అధికారానికే అనుకూలంగా ఉంటారో వేచిచూడాలి.

ఎన్నికల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్

ప్రజాశక్తి - ఏలూరు

ఎంఎల్‌సి ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్‌కు అవకాశం కల్పించినట్లు తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. ఈ నెల 27న జరగబోయే ఎంఎల్‌సి ఎన్నికల నిమిత్తం, ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించు కోవచ్చునన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది తమ ఓటుహక్కును వినియోగించుకునేందుకు ఫారం-12ను జిల్లా రిటర్నింగ్ అధికారి, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం/జిల్లా కలెక్టర్, ఏలూరు వారికి ఈ నెల 20వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు సమర్పించాలన్నారు. సిబ్బంది ఫారం-12ను eluru.ap.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసే సిబ్బంది ఫారం-12తోపాటు వారికి డ్యూటీ కేటాయించిన ఉత్తర్వుల ప్రతి జత చేయాలని సూచించారు.



చాట్రాయిలో ప్రజాసంఘాల ప్రచారం

లక్ష్మణరావును గెలిపించాలని ప్రచారం

ప్రజాశక్తి - చాట్రాయి

కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి అభ్యర్థి కెఎస్.లక్ష్మణరావును గెలిపించాలని కోరుతూ మండలంలో శనివారం ప్రజాసంఘాల ఆధ్వర్యాన ప్రచారం నిర్వహించారు. మండల కేంద్రంలో ఎపి వ్యకాస మండల కార్యదర్శి మేడేపల్లి హోలీమేరీ ఉపాధ్యాయులకు కరపత్రాలు పంచి పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్.లక్ష్మణరావుకు ప్రథమ ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

కలిదిండి: కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో ఉద్యోగ, ఉపాధ్యాయ, కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్, కార్మిక, కర్షక, మహిళా సంఘాలతోపాటు పలు ప్రజా సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్.లక్ష్మణరావును గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యోగ, కార్మికులు, రైతులు, నిరుద్యోగులందరి సమస్యలపై లక్ష్మణరావు శాసనమండలిలో తన గొంతు విన్పించడంతోపాటు ప్రజాఉద్యమాల్లో ప్రత్యక్షంగా పాల్గొని కేసులను సైతం ఎదుర్కొంటున్నారని, ప్రజల పక్షాన నిలబడే లక్ష్మణరావుకు ప్రథమ ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రజాసంఘాల నాయకులు ఎస్.మహంకాళిరావు, జె.మహేష్, వి.భాస్కరరావు, పి.ప్రకాష్, అబ్దుల్ అక్బర్, పి.రాజేష్, బి.రామనాగేంద్రం, పి.పద్మ పాల్గొన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులును గెలిపించాలి

ప్రజాసంఘాల విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి



జీలుగుమిల్లి మండలంలో ప్రజాసంఘాల నేతల ప్రచారం

పేద, బడుగు, బలహీన వర్గాల గొంతుకైన పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి దిడ్ల వీర రాఘవులుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తెల్లం దుర్గారావు పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని కామయ్యపాలెం, జీలుగుమిల్లి, ములగలంపల్లి జెడ్‌పి హైస్కూళ్లలో పిడిఎఫ్ అభ్యర్థి డివి.రాఘవులును గెలి పించాలని ప్రచారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సమస్యలపై పోరాడే పిడిఎఫ్ అభ్యర్థిని గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో సిహెచ్.కొండలరావు, మస్తాన్, రాంబాబు పాల్గొన్నారు.

వీరవాసరం :పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులును చట్టసభకు పంపాలంటూ సిఐటియు, ప్రజాసంఘాలు కోరాయి. శనివారం సిఐటియు, ప్రజా సంఘాల బృందం పిడిఎఫ్ అభ్యర్థి వీర రాఘవులను గెలిపించాలంటూ ఉత్తరపాలెం, కొణితివాడలో ప్రచారం నిర్వహించారు. 40 ఏళ్ల ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగి నేడు ప్రజల కోసం శాసనమండలి ఎన్నికల్లో వీర రాఘవులు పోటీ చేస్తున్నారని తెలిపారు. ఆయనను ఎందుకు గెలిపించాలో ప్రచారం బృందం ఓటర్లకు వివరించారు. ఈ ప్రచారంలో రైతు సంఘం నాయకులు జుత్తిగ నరసింహమూర్తి, బాలం విజయకుమార్, పోతుల మృత్యుంజయ, కేతా జ్యోతిబసు పాల్గొన్నారు.

గణపవరం : పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో యుటిఎఫ్, ప్రజా సంఘాలు బలపర్చిన పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులుకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గణపవరం, పిప్పర, కేశవరం గ్రామాల్లో ఓటర్లను అభ్యర్థిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, సిఐటియు మండల అధ్యక్షులు ఎం.పెంటారావు, వ్యకాస మండల కార్యదర్శి నరాలశెట్టి రామకృష్ణ మాట్లాడుతూ ఉద్యోగ, కార్మిక, కర్షకుల గొంతు పెద్దల సభలో లేవనెత్తే పిడిఎఫ్ అభ్యర్థి వీర రాఘవులుకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ నెల 27న జరిగే ఎన్నికల్లో వీర రాఘవులు గెలుపునకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. గ్రామాల్లోని పలు పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లోని ఓటు ఉన్న ఒక్కరినీ కలిసి ఓట్లు అభ్యర్థించారు.

కోళ్ల ఫారాల్లో అపరిశుభ్రతే పెద్ద సమస్య


రాష్ట్ర పశుసంవర్ధక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్

తణుకు రూరల్: కోళ్ల ఫారమ్‌లో అపరిశుభ్రత పెద్ద సమస్యగా ఉందని, పరిశుభ్రతపై ప్రత్యేక ఆదేశాలు జారీ చేశామని రాష్ట్ర పశుసంవర్ధక, డైరీ డెవలప్మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బుడితి రాజశేఖర్ తెలిపారు. శనివారం అధికారి రాజశేఖర్ తొలుత ఉంగుటూరు మండలం బాదంపూడి పౌల్ట్రీ షెడ్లను పరిశీలించారు. అనంతరం తణుకు మండలం వేల్పూరు జి.కృష్ణానందం పౌల్ట్రీ షెడ్లను రాష్ట్ర పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ టి.దామోదరనాయుడు, జిల్లా కలెక్టర్ నాగరాణితో కలిసి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర పశు సంవర్ధక, డైరీ డెవలప్మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బుడితి రాజశేఖర్ మాట్లాడుతూ కోళ్ల ఫారమ్స్‌లో అపరిశుభ్రత అతిపెద్ద సమస్యగా ఉందన్నారు. బర్డ్ ఫ్లూ వైరస్ సమాచారం మొట్టమొదటి బాదంపూడి కోళ్ల ఫారమ్ నుంచి అందిందన్నారు. దీనికి కారణం పౌల్ట్రీ లిట్టర్ అన్నారు. పౌల్ట్రీలో కోళ్ల విసర్జన, చిందిన ఫీడ్, ఈకలు మిశ్రమం షెడ్ల కిందకు చేరడంతో కొంగలు వంటి పక్షులు ఆకర్షణకులోనై అవి ఇతర ప్రాంతాలకు వైరస్ వాహకాలుగా ఉంటాయని తెలిపారు. ఎ పరీక్షల్లో వైరస్ రుజువైన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలా యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కొంతమంది పౌల్ట్రీ యజమానులు వైరస్ తగ్గుతుందిలే అని దాచి ఉంచడం కూడా ఇంత ఎక్కువగా వైరస్ వ్యాప్తి చెందడానికి కారణమన్నారు. ప్రస్తుతం వైరస్ నెమ్మదించిందని, వాతావరణంలో వేడి పెరగడంతో వైరస్ ఇబ్బంది తొలుగుతుందని తెలిపారు. ఆయన వెంట రాష్ట్ర పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ టి.దామోదరనాయుడు, కలెక్టర్ నాగరాణి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి మురళీకృష్ణ ఉన్నారు.

ఎందుకింత నిర్లక్ష్యం..!

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాను బర్డ్‌ఫ్లూ భయం బెంబేలెత్తిస్తోంది. బర్డ్‌ఫ్లూ సోకిన కోళ్లఫారాలు ఒకొక్కటీ వెలుగులోకి వస్తుండడంతో జనం ఉలిక్కిపడుతున్నారు. ఇక ఎంఎల్‌సి ఎన్నికల ప్రచార హోరు ప్రారంభమైంది. ఈ పోరులో తలపడే అభ్యర్థుల జాబితా సిద్ధం కావడంతో అంతా ప్రచారంపై దృష్టి సారించారు. ఐక్య పోరాటాలతోనే ఎవరినైనా కదిలించగలమని ఆదివాసీ గిరిజనులు మరోసారి రుజువు చేశారు. 1/70 చట్ట సవరణ యోచన లేదని సిఎం చంద్రబాబు ప్రకటించాల్సి రావడమే దీనికి నిదర్శనం.

బర్డ్‌ఫ్లూ కలకలం తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం కానూరులో ప్రారంభమై పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాలకు వ్యాపించింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో తణుకు మండలం వేల్పూరులోని ఒక పౌల్ట్రీలో కోళ్లకు బర్డ్‌ఫ్లూ సోకినట్లు కలెక్టర్ అధికారికంగా ప్రకటించారు. ఆ పౌల్ట్రీకి కిలోమీటర్ మేర రెడ్‌జోన్, పది కిలోమీటర్ల మేర సర్వేలైన్స్ జోన్‌గా ప్రకటించారు. రెడ్‌జోన్ అనగానే కరోనా నాటి పరిస్థితులు గుర్తొచ్చి జనం ఒకింత ఆందోళనకు గురయ్యారు. అయితే అంత కఠిన పరిస్థితులు లేకపోవడంతో ఒకింత ఊరట చెందారు. ఆ తర్వాత ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం బాదంపూడిలోనూ కోళ్లకు బర్డ్‌ఫ్లూ సోకినట్లు నిర్ధారించి నివారణా చర్యలు చేపట్టారు. రెండు చోట్లా కోళ్ల ఖననం, డిస్‌ఇన్ఫెక్ట్ చేసేందుకు రాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లను రంగంలోకి దింపారు. ఇంతవరకూ బాగానే ఉంది. అసలు బర్డ్‌ఫ్లూ నిర్ధారణకు ఎందుకింత ఆలస్యమైందనే ప్రశ్న అందరినీ తొలిచేస్తోంది. గత డిసెంబర్ నుంచే కోళ్లు పెద్ద సంఖ్యలో మృత్యువాత పడటం అందరికీ తెలిసిందే. తొలుత నాటుకోళ్లు పెద్దసంఖ్యలో మృత్యువాత పడ్డాయి. దాని ప్రభావం సంక్రాంతి సంప్రదాయం ముసుగులో జరిగే కోడి పందేలపైనా కన్పించింది. సరైన పుంజులు లేక ఉన్న పుంజులతో సాగిన పందేల్లోనే పెద్దఎత్తున నగదు చేతులు మారింది. ఆ తర్వాత బ్రాయిలర్ కోళ్లు మృత్యువాత పడటం ప్రారంభమైంది. అప్పటికీ జిల్లాలోని పశుసంవర్ధక శాఖాధికారులుగానీ, జిల్లా ఉన్నతాధికారులుగానీ అటువైపు పరిశీలించిన దాఖలాల్లేవు. ఉమ్మడి జిల్లాలో సుమారు రెండు లక్షల కోళ్లు మృత్యువాత పడ్డాక అధికార యంత్రాంగం కదిలి దృష్టి సారించగా బర్డ్‌ఫ్లూ నిర్ధారైంది. అప్పటికే కోళ్ల మృత్యువాతతో తీవ్ర నష్టాల్లో కూరుకుపోయిన పౌల్ట్రీ రైతులకు బర్డ్‌ఫ్లూ నిర్ధారణ గోరుచుట్టుపై రోకలిపోటులా పరిణమించింది. ఈ క్రమంలో అధికారుల ప్రకటనలు పౌల్ట్రీ రంగాన్ని కోలుకోలేని దెబ్బతీశాయి.




కోడిగుడ్లు, మాంసం వాడరాదని సాగిన ప్రచారంతో అమ్మకాలు ఒక్కసారిగా పడిపోయాయి. అదే సమయంలో ఇతర ప్రాంతాలకు ఎగుమతులు సైతం నిలిచిపోయాయి. దీంతో పౌల్ట్రీ రైతులు ఫారాలు వదిలి బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. రెడ్‌జోన్ పరిధిలో మూడు నెలల వరకూ కోళ్లఫారాలు తెరిచే అవకాశం లేదు. అంటే జూన్ వరకూ కోళ్లఫారాల జోలికెళ్లే పరిస్థితి లేదు. ఈ లోపు ఆ పరిధిలో ఇంకేమైనా కేసులు వెలుగుచూస్తే మరింత జాప్యం తప్పనిసరి. ఈ నేపథ్యంలో పౌల్ట్రీ రైతులను ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అదే సమయంలో బర్డ్‌ఫ్లూ వ్యాప్తి నేపథ్యంలో కోడిమాంసం, గుడ్లు వాడొచ్చా.. వాడొచ్చుంటే ఎలా వాడాలి, లేదంటే ఎప్పటి వరకూ ఏ పరిధిలో వారు వాటి జోలికెళ్లకూడదు అనే అంశాలను ప్రభుత్వం విస్తృత ప్రచారం చేయాలి. అలాగే కోళ్లు డిసెంబర్ నుంచే మృత్యువాత పడుతున్నా సంబంధిత అధికారులు ఏం చేశారు.. ఎందుకు ముందస్తు చర్యలు చేపట్టలేదనే దానిపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు చేపట్టాలని అటు పౌల్ట్రీ రైతులు, ఇటు జనం కోరుతున్నారు.

ఇక ఎంఎల్‌సి ఎన్నికల ప్రచారం షురూ అయ్యింది. అయితే ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచి కోడ్ అమలులో రెండు జిల్లాల అధికారులు, సిబ్బంది తడబడుతూనే ఉన్నారు. పోనీ మొదట్లో ఒకింత అలసత్వం వహించినా నామినేషన్ల పర్వంలోనూ అదే నిర్లక్ష్యం కొనసాగడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ప్రధానంగా కూటమి అభ్యర్థి నామినేషన్ సందర్భంగా పోలీసులు వ్యవహరించిన తీరు అందరినీ ఆలోచింపజేసింది. అధికార పార్టీ అభ్యర్థికి ఒక నిబంధనలు, ఇతర అభ్యర్థులకు వేరే నిబంధనలు ఉంటాయా అనే అనుమానాలు తలెత్తాయి. ఇదే కాదు గ్రామీణ, పట్టణ స్థాయిలో అధికార పార్టీ ప్రచార ఫ్లెక్సీల తొలగింపులోనూ ఇదే నిర్లక్ష్యం కన్పించింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కోడ్ పక్కాగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రాజ్యాంగ, ప్రభుత్వ పదవుల్లో ఉన్నవారు మాట్లాడే ప్రతి మాట వెనుకా కచ్చితంగా అంతరార్థం వేరే ఉంటుందనేది అందరికీ తెలిసిందే. ఈ తరహాలోనే విశాఖపట్నంలో జరిగిన ఓ కార్యక్రమంలో 1/70 చట్టాన్ని సవరించాలని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలు ఆదివాసీ గిరిజనులను తీవ్ర వేదనకు గురి చేశాయి. పర్యాటక రంగ అభివృద్ధి పేరిట గిరిజనుల హక్కులను కాలరాస్తామనడం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ తీరును కూటమి ప్రభుత్వం తూచా తప్పకుండా పాటిస్తున్నట్లు స్పష్టమవుతోంది. స్పీకర్ వ్యాఖ్యలపై పలువురు అభ్యంతరాలు తెలిపినా కూటమి ప్రభుత్వ పెద్దలు ఎవరూ స్పందించలేదు. దీనిపై ఆదివాసీ గిరిజన సంఘాల జెఎసి ఆధ్వర్యాన ఈ నెల 11, 12 తేదీల్లో ఏజెన్సీ బంద్‌కు పిలుపునిచ్చినా కదలిక లేదు. 11వ తేదీన ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులంతా ఐక్యంగా రోడ్డెక్కి బంద్ విజయవంతం చేయడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించి 1/70 చట్ట సవరణ యోచన లేదని ప్రకటించారు. కొందరి దుష్ప్రచారం నమ్మొద్దని పేర్కొన్నారు. ఆదివాసీ గిరిజన సంఘాలది దుష్ప్రచారమైతే స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలు చేయడం అబద్ధమా, లేక ప్రభుత్వ యోచనే స్పీకర్ నోటి వెంట వెలువడ్డాక వ్యతిరేకత రావడంతో వెనక్కితగ్గారా అనేది తేలాల్సి ఉంది. ఒకవేళ అయ్యన్నపాత్రుడే పొరపాటున మాట్లాడి ఉంటే స్పీకర్ స్థానంలో ఉన్న వ్యక్తి ఎందుకింత నిర్లక్ష్యం అనే విమర్శలు విన్పిస్తున్నాయి.

- వివిఎస్ఎస్‌వి.ప్రసాద్



గుండుగొలనులోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం సేవలు పెంచాలి

కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - భీమడోలు

గ్రామ పంచాయతీల ఆధ్వర్యాన నిర్వహిస్తున్న చెత్త సంపద తయారీ కేంద్రం సేవలను మరింత విస్తృతం చేయాలని, అదనపు ఆదాయ వనరుగా మార్చుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి కోరారు. గుండుగొలను పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెత్త సంపద తయారీ కేంద్రాన్ని శనివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వివిధ అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కేంద్రం ద్వారా గ్రామ పంచాయతీకి అదనంగా వస్తున్న ఆదాయం గురించి పంచాయతీ కార్యదర్శి మురళీ, ఇఒపిఆర్‌డి ఎ.సుందరి, ఎంపిడిఒ పద్మావతిదేవి వివరించారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ అక్కడ మామిడి మొక్కలను, పూల మొక్కలను నాటారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ సుబ్బారావు, డిపిఒ అనురాధ, ఏలూరు ఆర్‌డిఒ అంబరీష్ పాల్గొన్నారు.

సచివాలయాల సిబ్బంది లక్ష్యాలను పూర్తి చేయాలి

సచివాలయాల సిబ్బంది తమకు కేటాయించిన విధుల లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని, రోజువారీ ప్రగతిని ఫొటోల ద్వారా అందజేయాలని కలెక్టర్ వెట్రిసెల్వి కోరారు. ఆమె శనివారం భీమడోలు మండలంలో పర్యటించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మండలంలో అభివృద్ధి కార్యక్రమాలపై మండలస్థాయి అధికారులతోపాటు, విఆర్‌ఒలు, సచివాలయాల కార్యదర్శులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లోని అర్జీల పరిష్కారం, ప్రజా సమస్యల పరిష్కార వేదిక, గృహనిర్మాణ సంస్థ, రీసర్వే, ఆధార్ కార్డుల నవీకరణ, రక్షిత నీటి పథకాల ట్యాంకుల పరిశుభ్రత, క్లోరినేషన్, ప్రభుత్వ ఆస్తుల స్వాధీనం, పంచాయతీ పన్నుల వసూలు ఇతర అంశాలపై పంచాయతీలవారీ సమీక్షించారు. రోజువారీ ప్రగతిపై నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ సుబ్బారావు, డిపిఒ అనురాధతోపాటు తహశీల్దార్ బి.రమాదేవి, ఎంపిడిఒ పద్మావతి దేవి, ఇఒపిఆర్‌డి ఎ.సుందరి పాల్గొన్నారు.

చెత్త సేకరణ వాహనాలు కొనసాగించాలి

తొలగించిన 60 మంది ఆటో డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలి

రాజకీయ పార్టీల, కార్మిక సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం

17న ప్రజాప్రతినిధులకు, అధికారులకు వినతులివ్వాలని నిర్ణయం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

నగరంలో ఇంటింటా చెత్త సేకరణ చేసే వాహనాలను కొనసాగించాలని, అక్రమంగా విధుల నుండి తొలగించిన 60 మంది క్లాప్ ఆటోల డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలని, మూడు నెలల బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలని రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. శనివారం స్థానిక పవర్‌పేటలోని సిఐటియు కార్యాలయంలో రాజకీయ పార్టీల, కార్మిక సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వైఎస్.కనకారావు అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు మాట్లాడుతూ క్లాప్ ఆటోలను తొలగించడం అన్యాయమన్నారు. వారికి బకాయి ఉన్న జీతాలు వెంటనే ఇవ్వాలని, తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకోవాలని కోరారు. క్లాప్ ఆటో డ్రైవర్ల ఉద్యమానికి తమ మద్దతు ఉంటుందని తెలిపారు. వైసిపి నాయకులు బత్తిన ప్రభాకర్‌రావు మాట్లాడుతూ గత ప్రభుత్వం మంచి ఉద్దేశంతో తీసుకొచ్చిన స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ క్లాప్ ఆటోలను కూటమి ప్రభుత్వం నిలుపుదల చేయడం అన్యాయమన్నారు. చెత్త వాహనాలను నిలిపివేయడం అంటే ప్రజల ఆరోగ్యాలతో ఆటలాడుకోవడమే అని విమర్శించారు. సిపిఐ జిల్లా నాయకులు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎలాంటి ముందస్తు నోటీసులూ ఇవ్వకుండా, బకాయి జీతాలు చెల్లించకుండా క్లాప్ ఆటోలను తొలగించడం అన్యాయమని అన్నారు. మెడికల్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సీతయ్య మాట్లాడుతూ క్లాప్ ఆటోల డ్రైవర్లను తొలగించడం వల్ల ప్రజారోగ్యం క్షీణిస్తుందని, చెత్త వాహనాలు నిలిపివేయడం వల్ల అంటురోగాలు ప్రబలే ప్రమాదం ఉందని అన్నారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.సోమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి జాన్‌బాబు మాట్లాడుతూ క్లాప్ వాహనాల నిలుపుదల వల్ల నగరంలో రోజురోజుకీ చెత్త సమస్య తీవ్రమవుతుందని, చెత్త ఎత్తేందుకు తగినన్ని వాహనాలు లేక ప్రజారోగ్యం క్షీణించే ప్రమాదం ఉందని అన్నారు. క్లాప్ ఆటోలను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వైసిపి నాయకులు ఎం.ఫణి, క్లాప్ ఆటోల డ్రైవర్ల అధ్యక్ష కార్యదర్శులు రాజు, గణేష్ ప్రేమ్, సుగుణ రావు, విజయ్ తదితరులు పాల్గొన్నారు. అఖిలపక్ష పార్టీలు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో అధికారులు, ప్రజాప్రతినిధులకు సోమవారం వినతిపత్రాలు ఇవ్వాలని సమావేశం తీర్మానించింది.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

జెసి పి.ధాత్రిరెడ్డి

ప్రజాశక్తి - ఏలూరు

పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని, అది అందరి బాధ్యత అని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి పిలుపునిచ్చారు. స్వచ్ఛఆంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా శనివారం కలెక్టరేట్లోని పరిసరాలను కలెక్టరేట్ సిబ్బందితో కలిసి జెసి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా జెసి ధాత్రిరెడ్డి మాట్లాడుతూ పరిశుభ్రతతో రోగాలు దరిచేరకుండా ఉంటాయన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత కూడా ప్రతిఒక్కరి జీవితంలో భాగం కావాలన్నారు. ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛఆంధ్ర-స్వచ్ఛదివాస్ కార్యక్రమాన్ని జిల్లా అంతటా నిర్వహించారని, దీనికి సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా కార్యక్రమాన్ని శాఖల అధికారులు నిర్వహిస్తారని తెలిపారు. పరిశుభ్రతతోనే ప్రజల ఆరోగ్యం ముడిపడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులే కాకుండా ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ వి.విశ్వేశ్వరరావు, కలెక్టరేట్ పరిపాలనాధికారి నాంచారయ్య, సూపరింటెండెంట్లు రవికుమార్, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

సర్వజన ఆసుపత్రిలో వంకర పాదాలకు చికిత్స

ఏలూరు అర్బన్ : ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో పుట్టుకతో వచ్చే 'వంకర పాదాల వ్యాధి చికిత్స' ప్రతి గురువారం 13వ నెంబర్ ఓపిలో అందుబాటులో ఉంటుందని అదనపు వైద్య విద్య సంచాలకులు, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి పర్యవేక్షకాధికారి డాక్టర్ ఎంఎస్.రాజు తెలిపారు. దీనిలో భాగంగా మేదినరావుపాలేనికి చెందిన శ్రావణి, శాంతిరాజు దంపతుల నాలుగు రోజుల వయస్సు గల చిన్నారికి వైద్యం చేసిన నేపథ్యంలో శనివారం ఆ వివరాలను ఆయన మీడియాకు వెల్లడించారు. తెల్ల సిమెంట్ కట్టుతో వైద్యం చేసినా తగ్గని వారికి ఆపరేషన్ ఉచితంగా వారికి అవసరమైన పరికరాలు 'కేర్ ఇండియా' సంస్థ సౌజన్యంతో ఉచితంగా అందిస్తామని తెలిపారు. ఈ వ్యాధి ఉన్న శిశువుకు ఎంత తొందరగా వైద్యం చేయిస్తే అంత మంచి ఫలితం ఉంటుందని, ఈ వంకర పాదాల చికిత్స సదుపాయాన్ని అవసరం ఉన్న ఏలూరు జిల్లా ప్రజలందరూ ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. వైద్యం చేసిన ఎముకల వైద్యులు డాక్టర్ నాగరాజు, డాక్టర్ నవ్య, మత్తు డాక్టర్లు, నర్సులు, ఎంఎన్‌ఒ, ఇతర బృంద సభ్యులను ఆయన అభినందించారు.

ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దాలి

డిఇఒ ఎం.వెంకటలక్ష్మమ్మ

ప్రజాశక్తి - భీమడోలు



విద్యార్థులతో ముచ్చటిస్తున్న డిఇఒ వెంకటలక్ష్మమ్మ

మారుతున్న విధానాలకు అనుగుణంగా విద్యాబోధన చేసి విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దాలని డిఇఒ ఎం.వెంకటలక్ష్మమ్మ కోరారు. ఆమె శనివారం గుండుగొలనులోని మండల ప్రాథమిక పాఠశాల నెం.1ను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయుల బోధన తీరును పరిశీలించారు. మరింత మెరుగైన విద్యాబోధనకు పలు సూచనలు చేశారు. నిర్ణీత కాలవ్యవధిలోగా సిలబస్ ఎంతవరకు పూర్తయిందనే అంశంపై ఆరా తీశారు. వర్క్‌బుక్స్ తనిఖీ చేశారు. డిఇఒ వెంట ఎంఇఒలు శ్రీనివాసరావు, భాస్కర్‌కుమార్ ఉన్నారు.

గుండెపోటుతో ఉపాధి హామీ కూలీ మృతి


జయమ్మ (ఫైల్)

ప్రజాశక్తి - దెందులూరు

ఉపాధి హామీ పనులు చేస్తుండగా గుండెపోటుతో కూలీ మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని ముప్పవరం గ్రామపంచాయతీ పరిధి కంద్రిక నరసింహపురంలో చోటు చేసుకుంది. ఉపాధి హామీ ఎపిఒ దశరథరామ్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని ముప్పవరం గ్రామపంచాయతీ పరిధిలోని కంద్రిక నరసింహపురం గ్రామానికి చెందిన గులిమే జయమ్మ (50) ముప్పవరం పంచాయతీ పరిధిలోని గరికమొక్కల చెరువులో శనివారం ఉపాధి హామీ పనికి వెళ్లింది. పని చేస్తుండగా గుండె నొప్పి వస్తుందని చెరువుగట్టు పైకి చేరుకున్న ఆమె ఒక్కసారిగా కుప్పకూలి మృతి చెందింది.

విశ్రాంత ఉపాధ్యాయుడికి సన్మానం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండలంలోని గొల్లపల్లి శ్రీ అన్నే రామకృష్ణయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేసిన భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు అక్కలనాగిరెడ్డి ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు. శనివారం స్కూల్‌ను చూడడానికి వచ్చారు. ఈ సందర్భంగా నాగిరెడ్డిని ప్రధానోపాధ్యాయులు రాధికారాణి, ఉపాధ్యాయలు, నాన్ టీచింగ్ సిబ్బంది ఘనంగా సన్మానించారు. నాగిరెడ్డి విద్యార్థుల అవసరాల నిమిత్తం స్కూల్‌కు రూ.ఐదు వేలు విరాళం ఇచ్చారు.

పోషణ్ బి పడాయి బిపై శిక్షణ

ప్రజాశక్తి - మండవల్లి

కానుకొల్లు, మండవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పోషణ్ బి పడాయి బి కార్యక్రమాలపై అంగన్వాడీ కార్యకర్తలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఇఇఆర్‌టి అరుణ ముఖ్య అతిథిగా హాజరై కార్యకర్తలకు అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ నాగలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులకు పోషకాహారం,ం విద్యను అందించే కేంద్రాలుగా మార్చడమే పోషణ్ బి పడాయి బి కార్యక్రమాల ముఖ్య లక్ష్యమన్నారు.

ముసునూరు :అంగన్వాడీ కేంద్రాల్లో బాల బాలికలకు పౌష్టికాహారం మెనూ ప్రకారం అందించాలని సూపర్‌వైజర్ కె.రాజ్యలక్ష్మి అన్నారు. మండల కేంద్రమైన ముసునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ కార్యకర్తలకు, ఉపాధ్యాయులకు పోషణ్ బి, పడాయి బి కార్యక్రమం ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ధనలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు.

పోలవరం :మండలంలో శనివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ కార్యకర్తల శిక్షణా తరగతులు మూడో రోజు కొనసాగాయి. ఈ కార్యక్రమంపై జిల్లాస్థాయిలో శిక్షణ పొంది మండలస్థాయిలో శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు సూపర్‌వైజర్లు తెలిపారు. వరుసగా మూడో రోజు శిక్షణ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రాణి, మాధవి, విజయకుమారిల ఆధ్వర్యంలో కొనసాగాయి. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికి తీయాలి

ప్రజాశక్తి - ముసునూరు

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఇఒ బివిఎస్.సుబ్బారావు అన్నారు. చెక్కపల్లి, ముసునూరు, గోపవరం జిల్లా పరిషత్ హైస్కూళ్లలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయుల బోధన సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి ఈ సమావేశం ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని ప్రచారం

ప్రజాశక్తి - ముదినేపల్లి

కృష్ణా - గుంటూరు పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని టిడిపి కైకలూరు నియోజవర్గ కన్వీనర్ వీర మల్లు నరసింహారావు కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ప్రచారం నిర్వహించారు. బొమ్మినంపాడులో ఇంటింటా ప్రచారం నిర్వహించి కరపత్రాలు అందించి ఓట్లు అభ్యర్థించారు.

రాజశేఖరం గెలుపునకు సహకరించాలి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - చింతలపూడి

ఎంఎల్‌సి ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం గెలుపునకు ఉపాధ్యాయులందరూ సహకరించాలని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ కోరారు. చింతలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో ఆయన శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ఎంఎల్‌సి ఎన్నికల్లో పేరాబత్తుల రాజశేఖరం గెలుపునకు సహకరించాలని కోరారు.

మండల విఆర్‌ఒల సంఘం ఎన్నిక

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండల విఆర్ఒల సంఘం ఎన్నిక తహశీల్దార్ సుభాని అధ్యక్షతన శనివారం జరిగింది. మండలాధ్యక్షులుగా ముదినేపల్లి విఆర్ఒ పుప్పాల బాలసుబ్రహ్మణ్యం, అల్లూరు విఆర్ఒ తోకల శ్రీరాములు, ఉపాధ్యక్షులుగా, కోశాధికారిగా పెదపాలపర్రు, దేవపూడి, విఆర్‌ఒలు తూర్లపాటి వెంకట రాధే శ్యామ్, కుర్మా సుధీర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నేటి నుంచి సామాజిక తనిఖీ

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఉపాధి హామీ చట్టం 16 సామాజిక తనిఖీ ఆదివారం నుంచి ప్రారంభిస్తున్నట్లు ఎంపిడిఒ మణికుమారి తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఉపాధి హామీ చట్టం సామాజిక తనిఖీ కోఆర్డినేషన్ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్ఆర్‌పి నందిని పర్యవేక్షణలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సామాజిక తనిఖీ ప్రారంభిస్తున్నట్లు ఆమె తెలిపారు.

నేరాలు - ఘోరాలు

వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - మండవల్లి

ఐసర్ వ్యాన్ ఢీకొని వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పులపర్రుకు చెందిన ఘంటసాల శ్రీనివాసరావు (34) బైక్‌పై కైకలూరు వెళ్లాడు. అక్కడ పని చూసుకుని తిరిగి తన ద్విచక్రవాహనంపై శుక్రవారం రాత్రి ఇంటికి బయలుదేరాడు. అదే సమయంలో కైకలూరు నుంచి ఏలూరు వైపునకు వెళ్తున్న ఐసర్ వ్యాను కాకతీయ నగర్ సమీపంలో ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనివాసరావు కింద పడిపోవడంతో ఐసర్ వ్యాను అతనిపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని సోదరుడు వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని శనివారం మృతదేహానికి పంచనామా నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో సిఐకు గాయాలు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

రోడ్డు ప్రమాదంలో సిఐ రాజేష్ గాయాలపాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... విజయవాడ సిఐడిలో సిఐగా పనిచేస్తున్న రాజేష్ కారులో వెళుతుండగా శనివారం తెల్లవారుజామున నగరంలోని ఫైర్‌స్టేషన్ సమీపంలో కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సిఐ రాజేష్‌కు గాయాలయ్యాయి. స్థానికులు ఆయనను ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. గతంలో ఆయన చింతలపూడి, జంగారెడ్డిగూడెం సిఐగా పని చేశారు.

నలుగురు బైండోవర్

ముసునూరు :నూజివీడు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్‌లో నలుగురు నిందితులను ముసునూరు తహశీల్దార్ కె.రాజ్‌కుమార్ ఎదుట హాజరు పరచి వారిని బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ పాత కేసుల్లో నిందితులు మళ్లీ నేరాలకు పాల్పడితే రూ.లక్ష జరిమానా విధించడంతో పాటు ప్రభుత్వ పథకాలను రద్దు చేస్తామని తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

నూజివీడు టౌన్ :మండల పరిధిలోని చిన్న మెర్సపూడి గ్రామంలో పేకాట స్థావరంపై పోలీసులు శనివారం దాడి చేశారు. ఈ దాడిలో తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.23,840 స్వాధీన చేసుకుని కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ లక్ష్మణ్ బాబు తెలిపారు.

బలివే వచ్చే యాత్రికులకు ఇబ్బందుల్లేకుండా చూడాలి

మంత్రి పార్థసారథి

ప్రజాశక్తి - ముసునూరు

బలివే ఉత్సవాల్లో యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం, ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను మంత్రి పార్థసారథి ఆదేశించారు. ఆలయం వద్ద ఉత్సవ్లా ఏర్పాట్లను ఆయన శనివారం పరిశీలించారు. స్నానాల ఘాట్లు, మెడికల్, పోలీస్ ఔట్ పోస్టులను, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. తమ్మిలేరు నీరు రెండు, మూడు రోజుల్లో ఆలయ పరిసర ప్రాంతాలకు వచ్చేలా చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు.

అపరాల రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

వైరస్ తెగుళ్ల సోకి నష్టపోతున్న కృష్ణా డెల్టా అపరాల రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండలంలోని మాదేపల్లి, లింగారావుగూడెంలో తెగుళ్ల సోకిన పెసర, మినుము పంటలను రైతు సంఘం నాయకులు శనివారం పరిశీలించారు. తెగుళ్ల సోకిన అపరాల పంటతో లింగారావుగూడెం పంట భూముల్లో నిరసన వ్యక్తం చేశారు. అపరాల రైతులను ఆదుకోవాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ వైరస్ తెగులు సోకడంతో పూత, పిందే దశలో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోతున్న అపరాల రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు.

8న మెగా లోక్ అదాలత్

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడిలో స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో మార్చి ఎనిమిదో తేదీన జరిగే మెగా లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్.మధుబాబు కోరారు. కోర్టు ఆవరణలో పోలీస్ అధికారులతో లోక్ అదాలత్‌పై శనివారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మధుబాబు మాట్లాడుతూ పెండింగ్ కేసుల పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని సూచించారు.

ఫెర్రీ రేవు పనుల పరిశీలన

ప్రజాశక్తి - పోలవరం

మహాశివరాత్రి సందర్భంగా గోదావరి నది దాటేందుకు ఏర్పాటు చేసిన ఫెర్రీ రేవు పనులను, ఏర్పాటు చేస్తున్న నడక మార్గానికి డ్రెడ్జింగ్ పనులను, యాత్రికులు సేద తీరేందుకు ఇసుక తిన్నెలపై చలువ పందిళ్లు, బట్టలు మార్చుకునే గదుల పనులను శనివారం తహశీల్దార్ సాయిరాజు పరిశీలించారు.

ధ్రువపత్రాల జారీపై అవగాహన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి (ఎఫ్ఎసి) ఎం.సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో అదనపు సీనియర్ సివిల్ జడ్జి కెకెవి.బుల్లికృష్ణ శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో జనన, మరణాల నమోదు, కుల ధ్రువపత్రాలు, వివాహ ధ్రువపత్రాలు జారీ అంశాలపై సంబంధిత అధికారులకు అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా బులికృష్ణ మాట్లాడుతూ జనన మరణాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని, వివాహ పత్రాలను నిర్దిష్ట సమయంలో సంబంధిత ఆఫీసుల్లో నమోదు చేసుకుని ధ్రువపత్రాలను పొందాలని సూచించారు. ధ్రువపత్రాల జారీకి సంబంధించిన చట్టాలపై పాల్గొన్న అధికారులకు అవగాహన కల్పించారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ముదినేపల్లి

అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన నిరుపేద వ్యక్తి కుటుంబ సభ్యులకు శనివారం డాక్టర్ మనోజ్ ఆర్థిక సాయం అందించారు. మండలంలోని పేరూరు గ్రామానికి చెందిన వీర్ల వెంకటరత్నం(38) కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి తన తండ్రి డాక్టర్ మనోజ్ ద్వారా రూ.ఐదు వేల నగదు, నిత్యావసర వస్తువులు అందించారు.

పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలి

కలిదిండి పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్ వార్షిక తనిఖీలు

ప్రజాశక్తి - కలిదిండి


రికార్డులు పరిశీలిస్తున్న ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్

పెండింగ్ కేసుల దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేయాలని ఎస్‌పి కె.ప్రతాప్‌శివకిషోర్ ఆదేశించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన శనివారం వార్షిక తనిఖీ నిర్వహించారు. రికార్డులను పరిశీలించారు. స్టేషన్‌కు వచ్చే బాధితుల పట్ల మర్యాదపూర్వకంగా నడుచుకుని వారి సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలని స్టేషన్ సిబ్బందికి సూచించారు. స్టేషన్ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని సూచిస్తూ మొక్కను నాటారు. రానున్న శివరాత్రి పండుగ నేపథ్యంలో స్థానిక శ్రీ పాతాళ భోగేశ్వర స్వామి ఆలయం వద్ద జరిగే ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు : ఎఎస్‌పి

ఏలూరు స్పోర్ట్స్ :మైనర్లకు వాహనాలు ఇచ్చి వారి నేరాల్లో భాగస్వాములు కావొద్దని జిల్లా అదనపు ఎస్‌పి నక్కా సూర్యచంద్రరావు అన్నారు. ఉప రవాణా కమిషనర్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మైనర్లు యాక్సిడెంట్ చేస్తే వాహన యజమానిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఉప రవాణా కమిషనర్ షేక్ కరీమ్ మాట్లాడుతూ 30 రోజుల్లో జిల్లావ్యాప్తంగా 50కి పైగా రహదారి భద్రతా అవగాహనా కార్యక్రమాలను నిర్వహించామన్నారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం ఆర్‌టిఒలు కృష్ణారావు, మదానీ మాట్లాడారు. గత 27 ఏళ్లుగా ఒక్క ప్రమాదం కూడా చేయని జిల్లాలోని ఆర్‌టిసి డ్రైవర్లకు, వివిధ విద్యాసంస్థల బస్సు డ్రైవర్లకు మెమొంటోలు అందించి సత్కరించారు. చిత్రలేఖనం, క్విజ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను అందించారు.

అంతర్వేదిగూడెంలో తాటాకిల్లు దగ్ధం

నిరాశ్రయులైన రెండు కుటుంబాలు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలోని అంత ర్వేదిగూడెం గ్రామంలో అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో రెండు గిరిజన కుటుంబాల వారు నిరాశ్రయులయ్యారు. సర్వం కోల్పోయిన తమను ఆదుకోవాలని బాధితులు చోడెం రాంపండు, దీపిక కోరుతున్నారు. రాంపండు, దీపిక కుటుంబాలు ఒకే ఇంట్లో నివాసం ఉంటున్నాయి. ఈ క్రమంలో శనివారం వారు పొలం పనులకు వెళ్లగా అగ్నిప్రమాదం సంభవించి తాటాకిల్లు పూర్తిగా దగ్ధమైంది. ఇంట్లోని ఆధార్ కార్డులు, పొలం పట్టాదారు పాస్ పుస్తకాలు, రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు, రూ.50 వేల, సామగ్రి, నిత్యావసర సరుకులు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. సర్వం కోల్పోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని, ఇంటిని మంజూరు చేయాలని, మంటల్లో కాలిపోయిన అన్ని పత్రాలను పొందే విధంగా చర్యలు తీసుకోవాలని బాధితులు వేడుకుంటున్నారు. అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలను సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మొడియం నాగమణి, సిపిఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ, గిరిజన సంఘం మండలాధ్యక్షులు పోలోజు నాగేశ్వరరావు పరామర్శించారు.


నిరాశ్రయులైన బాధిత కుటుంబాలు

పారిశుధ్య కార్మికులకు మౌలిక సదుపాయాలు కల్పించాలి

జంగారెడ్డిగూడెం :పట్టణంలో ఉన్న చెత్తను సేకరించి తీసుకెళ్లే లారీ ముందు భాగంలో అద్దాలు లేకపోవడంతో పారిశుధ్య కార్మికు లు పలు ఇబ్బందులకు గురవుతున్నారని డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి ఎస్.కె మాబు సుభాని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణ ప్రజలు ఆరోగ్యంగా ఉండడంలో కీలక పాత్ర పోషి స్తున్న పారిశుధ్య కార్మికుల ప్రాణాలకు రక్షణ లేకుండా పో యిందన్నారు. తక్షణమే వారికి కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని, చెత్తను సేకరించే లారీకి వెంటనే మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేశారు. లేకపోతే మున్సిపల్ కార్మికుల సమస్యలపై ప్రజాసంఘాలను ఐక్యం చేసుకుని ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ఓటింగ్ ప్రాముఖ్యతపై అవగాహన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఆర్‌జియుకెటి నూజివీడు క్యాంపస్‌లో ఓటింగ్ ప్రాముఖ్యతపై అవగాహన పెంచే సిస్టమాటిక్ ఓటర్ల విద్య, ఎన్నికల భాగస్వామ్యం కార్యక్రమం నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్ ఓటు హక్కు అనేది ప్రతిఒక్కరీ బాధ్యత అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌జియుకెటి నూజవీడు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మణ్, తహశీల్దార్ సుబ్బారావు, డిప్యూటీ తహశీల్దార్ రవికిరణ్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ కె.వెంకటేశ్వరరావు, డిఎస్‌డబ్ల్యూ డాక్టర్ దుర్గాభవాని, బ్రహ్మాస్వాములు, చీఫ్ వార్డెన్ డాక్టర్ పివి.లక్ష్మణరావు, అసోసియేట్ డీన్ అకాడమిక్స్ రఘుకుమార్ పాల్గొన్నారు.

ముసునూరు :ఓటర్లందరూ తమ ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని తహశీల్దార్ కె.రాజకుమార్, ఇఒపిఆర్‌డి బసవరాజు అచ్యుత సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రమైన ముసునూరు మండల పరిషత్ కార్యాలయం నుంచి ప్రధాన మండపం సెంటర్ వరకు ఓటు హక్కుపై విద్యార్థులతో శనివారం ర్యాలీ నిర్వహించారు.

స్పా, మసాజ్ సెంటర్లను నిషేధించాలి

ఏలూరు అర్బన్ :ప్రభుత్వ అనుమతితో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్న స్పా, మసాజ్ సెంటర్లను నిషేధించాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వరక శ్యామల, మన్నవ యామిని శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగం లేని, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న మధ్యతరగతి, పేద మహిళలను టార్గెట్ చేసి, వారికి ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి, స్పా సెంటర్‌లో చేర్చి వారిని బలవంతంగా వ్యభిచారం చేయిస్తున్నారని తెలిపారు. పోలీసు శాఖ స్పా, మసాజ్ సెంటర్లపై దృష్టి సారించి నిర్వాహకులపై కఠిన చర్యలు చేపట్టి, సాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్న స్పా, మసాజ్ కేంద్రాలను నిషేధించాలని పేర్కొన్నారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి

ఘనంగా స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛదివాస్

ప్రజాశక్తి - ముదినేపల్లి


ముదినేపల్లి స్పామ్ ఐటిఐలో...

ముదినేపల్లిలోని స్పామ్ ఐటిఐలో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్, ప్రిన్సిపల్ కె.సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర ఆవశ్యకతను విద్యా ర్థులకు వివరించి ప్రతిజ్ఞను చేయించారు. అనంతరం కళాశాల పరిసర ప్రాంతాలను, వర్క్‌షాపులను, కార్యాల యాన్ని, పరిసరాలను పరిశుభ్రం చేయించారు. ఈ కార్యక్ర మంలో వైస్ ప్రిన్సిపల్ కె.హరిత, అధ్యాపకులు మణిభీమరా జు, బి.కృష్ణమోహన్, విఎన్.విజయదుర్గ, శివ పాల్గొన్నారు.

భీమడోలు :మండలంలోని పలు ప్రాంతాలు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యాలయాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఎంపిడిఒ పద్మావతి దేవి, పంచాయతీ విస్తరణాధికారి ఎ.సుందరి పాల్గొన్నారు. భీమడోలు శ్రీ వెంకటేశ్వర డిగ్రీ, జూనియర్ కళాశాలలో భీమడోలు ఎక్సైజ్ సిఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కార్యాలయ సిబ్బందితో పాటు, కళాశాలకు చెందిన విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది భాగస్వామ్యం వహించారు. భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య కేంద్రం పర్యవేక్షకులు డాక్టర్ ఎన్.సునీత ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు.

దెందులూరు :స్వర్ణాంధ్ర స్వఛాంధ్ర కార్యక్రమాన్ని పురస్కరించుకుని దెందులూరు బిఆర్‌డి స్కూల్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థులు ర్యాలీగా నిర్వహించారు. గ్రామ ప్రజలకు పరిసరాల పరిశుభ్రత, పరిసరాలు ఆరోగ్య సంపద నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. కృష్ణుడి ఆలయం వద్దకు చేరి అక్కడ వలయాకారంలో విద్యార్థులు నిలబడి స్వర్ణాంధ్ర స్వఛాంధ్రకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో దెందులూరు తహశీల్దార్, డెవలప్‌మెంట్ ఆఫీసర్, పంచాయతీ స్పెషల్ ఆఫీసర్, సచివాలయ సిబ్బంది, కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చాట్రాయి :స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని తుమ్మగూడెం ఎంపిపిఎస్ ఉర్దూ పాఠశాలలో శనివారం విద్యార్థులతో స్వచ్ఛభారత్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పాఠశాల ఆవరణ శుభ్రం చేశారు.

చింతలపూడి :చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాసరావు, స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కమిటీ సమన్వయకర్త డాక్టర్ ఎ.వెంకటేశ్వరరావు మాట్లాడారు. అనంతరం వివిధ విభాగాల ఆధ్వర్యంలో పరిసరాలు పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు.

టి.నరసాపురం :మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పరిసరాలు శుభ్రం చేసి స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మణికుమారి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ పి.శేఖర్‌బాబు, పి.రఘు, శివ, రవి పాల్గొన్నారు.

జీలుగుమిల్లి :పి.ఆంకంపాలెం గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని మండల ప్రత్యేకాధికారి, డిఎల్‌పిఒ మహ్మద్ రజాఉల్ల సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో తయారయ్యే వర్మీ కంపోస్ట్ ఎరువుల తయారీ విధానాన్ని పరిశీలించారు.

పోలవరం : పోలవరం గ్రామపంచాయతీ పరిధిలో పలు రకాల పారిశుధ్య కార్యక్రమాలను పంచాయతీ సెక్రటరీ వై.కొండలరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం పంచాయతీ పారిశుధ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలతో పంచాయతీ కార్యాలయం నుంచి ఏటిగట్టు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు.

నూజివీడు టౌన్ : పరిసరాల పరిశుభ్రత కోసం ప్రతిరోజు కొంత సమయం కేటాయిస్తామని, తమ వంతు కృషిగా స్వచ్ఛత కార్యక్రమాల కోసం శ్రమదానం చేసి పరిశుభ్ర ఆంధ్రప్రదేశ్ సాధించే సంకల్పానికి కట్టుబడి ఉంటామని ఎక్సైజ్ సిఐ ఎ.మస్తానయ్య స్టేషన్ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ప్రతిఒక్కరూ స్వచ్ఛంద్రప్రదేశ్‌గా తీర్చి దిద్దేందుకు కృషి చేయాలని ఎక్సైజ్ సిఐ ఎ.మస్తానయ్య అన్నారు.

చింతలపూడి : ప్లాస్టిక్ వ్యర్థాలను ఉపయోగించకూడదని చింతలపూడి సిఐ అశోక్ సూచించారు. స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా చింతలపూడి స్టేషన్ ప్రాంగణాన్ని సిఐ, ఎస్ఐలు, సిబ్బంది కలిసి శుభ్రం చేసి మొక్కలను నాటారు.

కలిదిండి : స్థానిక శ్రీ సుగుణ జూనియర్ కళాశాల విద్యార్థులు పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించి స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛదివాస్ కార్యక్రమంలో భాగంగా క్యాంపస్ పరిసర ప్రాంతాల్లో చెత్తా చెదారాన్ని తొలగించారు. ప్రిన్సిపల్ టివి.వెంకటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ ప్రాజెక్టు అధికారి జి.మోహన్‌రావు, అధ్యాపకులు నాగేశ్వరరావు, సత్యానందం, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ : కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణం, తరగతి గదులు, ఆఫీసు శుభ్రపరిచారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో కళాశాల ఎన్ఎస్ఎస్ పిఒ డాక్టర్ ఒ.విజయకుమార్ విద్యార్థులతో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ, ర్యాలీ నిర్వహిం చారు.